Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

ఫ్యామిలీ కౌన్సెలింగ్

# ఆడపిల్లగా ఎందుకు పుట్టాను?

నేనొక మధ్యతరగతి అమ్మాయిని. 'నీట్' లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాను. కొన్ని కారణాల వల్ల నేను నాస్తికురాలినయ్యాను. అయితే మా ఇంట్లో నన్ను దేవుడిని నమ్మాలని బలవంతపెడుతున్నారు. ఇంట్లో నాకెటువంటి స్వాతంత్ర్యం లేదు. నన్ను బయటకు వెళ్లనివ్వరు. స్నేహితులతో, బంధువులతో కలవనీయరు. నా ఆలోచనలు పంచుకున్న అమ్మ కూడా మొదట నేను కరెక్ట్ అంటూనే తర్వాత దేవుడిని నమ్ముకోమంటోంది. నాకిష్టమైన మార్గం ఎంచుకునే స్వేచ్ఛ లేదా? అసలు మా అమ్మానాన్నలపైన కేసు పెట్టాలని ఉంది. మా అన్నకు లేని ఆంక్షలు నాకే ఎందుకు? ఆడపిల్లగా ఎందుకు పుట్టాను? ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తోంది. చదవలేక పోతున్నా. డిప్రెషన్‌లో కూరుకుపోతున్నా. ఎలా బయటపడాలి?

\- సీమ

మనదేశంలో కులాలకు, మతాలకు ఉన్న విలువ మనిషికి, మానవత్వానికి లేదు. ఎంత చదువుకున్నా వీడని జాఢ్యం ఇది. అలాంటి వ్యవస్థతో పోరాడటం ఇప్పుడు మీకంత అవసరమా? బహుశా మీ అక్కకు ఇచ్చిన స్వేచ్ఛ మీకు లభించకపోవడం కారణమై ఉండొచ్చు. మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్లల రక్షణకు సంబంధించిన ఆందోళనే అందుకు కారణం. పేపర్లలో, టీవీల్లో వచ్చే వార్తలు చూస్తారు కదా! అయితే అందుకు దేవుడిని శపించి అర్జెంటుగా అమ్మానాన్నలపై కేసు వేస్తే ఫలితం ఉండదు. దీనిపై మీ తల్లిదండ్రులతో మాట్లాడండి. నిజంగా మీ అమ్మానాన్నలు అంత చెడ్డవాళ్లు అయితే మిమ్మల్ని చదివించరు. పదహారేళ్లకే మీకు ఇన్ని ఆలోచనలు వస్తే మిమ్మల్ని కన్నవారికి ఇంకెన్ని రావాలి? ఇక్కడ మిమ్మల్ని తప్పు పట్టడం కాదు నా ఉద్దేశం. అనవసరమైన అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నారని. చక్కగా చదివి ఒక స్థాయికి చేరుకుంటే ఎవరూ ఏమీ అనలేరు. ఇప్పుడు ఉన్న ఆలోచనలే అప్పుడూ ఉంటే నిర్ణయించుకోవడం మీ చేతుల్లో ఉంటుంది. అంచేత లేనిపోని విషయాలు ఆలోచించకుండా చదువే ధ్యేయంగా ముందుకు సాగండి.

● కె.శోభ
ఫ్యామిలీ కౌన్సెలర్, హార్ట్ టు హార్ట్,
shobhas292@gmail.com

